క్లుప్తంగా

పంట వ్యర్థాలను తగులబెట్టొద్దు

పమిడిముక్కల: పంట వ్యర్థాలను తగులబెట్టవద్దని ఏఓ గణేష్‌రెడ్డి రైతులకు సూచించారు. భూసారానికి, పర్యావరణానికి హాని తలపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. పంట వ్యర్థాలను తగులబెట్టుట వలన పోషకాలు నశిస్తాయని పేర్కొన్నారు. భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుందన్నారు. నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, నేల యొక్క స్వాభావిక లక్షణాలు మారిపోతాయన్నారు. నేలలో తేమను నిలుపుకునే శక్తి తగ్గిపోతుందని, నేలలో ఆమ్లగుణం పెరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.

కొత్త పింఛన్ల అందజేత



మండవల్లి: మండవల్లిలో కొత్త పింఛన్లను సర్పంచ్ మెండా ఝాన్సీ, వార్డు సభ్యులు పసుపులేటి నాంచారయ్య బల్లవరపు సంధ్యారాణి మంగళవారం అందజేశారు. నలుగురు మహిళలకు నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండా సురేష్‌బాబు, గుడివాడ గణేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయికుమార్ పాల్గొన్నారు.

పాఠశాల రోడ్డుకు మరమ్మతులు చేయాలి



గుడివాడరూరల్: పట్టణంలోని ఆంధ్ర నలందా మున్సిపల్ పాఠశాల రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండలంలోని లింగవరం గ్రామానికి చెందిన సామాజిక వేత్త ఎ.రవికిరణ్ కోరారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్లకార్డు పట్టుకుని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుందని, ఈ రోడ్డులో మూడు కల్యాణ మండపాలు ఉన్నాయని ముందస్తుగా ఎటువంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

స్థల దాతకు సన్మానం



జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రామంలోని ఎస్‌వీఎస్‌ఆర్ ఆంజనేయ చౌదరి చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణ మండపానికి ఎదురుగా ఉన్న 20 సెంట్ల స్థలాన్ని వాహనాల పార్కింగ్ నిమిత్తం అందజేసిన దాతను మంగళవారం గ్రామంలో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోగినేని సతీష్‌కుమార్ మాట్లాడుతూ కమిటీ ఉపాధ్యక్షుడు పొట్లూరి వెంకటేశ్వరరావు విశేష కృషి ఫలితంగా దాత వల్లభనేని సీతారామశాస్త్రులు రంగనాయకమ్మల జ్ఞాపకార్థం వారి మేనల్లుడు కాట్రగడ్డ జయంత్ ఈ స్థలాన్ని అందజేశారని తెలిపారు. గుడివాడ విశ్వ భారతి విద్యా సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ప్రముఖ ఆడిటర్ బొప్పూడి సుబ్రమణ్యేశ్వరరావు, ఏపీడీడీసీ మాజీ చైర్మన్ వల్లభనేని రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ-2 బాలాజీ అన్నారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్ వద్ద మంగళవారం విద్యార్థులకు ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్ష చివరి రోజు 10వ తరగతి విద్యార్థులు పరీక్షల అనంతరం రోడ్ల పైన, పరీక్ష కేంద్రాల వద్ద, తమ వద్ద ఉన్న పేపర్లను చింపి ఎగరవేయకూడదన్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తగు చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

పెదపారుపూడి: యలమర్రు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ చేసిన బొల్లిగర్ల సాంబశివరావును సోమవారం ఘనంగా సత్కరించారు.ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి తదితరులు సాంబశివరావు దంపతులను సత్కరించారు. యలమర్రు పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నాసిరకంగా గుడివాడ చానల్ పనులు

- పట్టించుకోని అధికారులు
- రైతుల ఆందోళన



యలమర్రు గుడివాడ చానల్‌లో తూతూ మంత్రంగా పూడిక తీత పనులు

యలమర్రు(పెదపారుపూడి): పెదపారుపూడి మండలంలోని యలమర్రులో గుడివాడ చానల్‌లో కొద్ది రోజులగా జరుగుతున్న పూడిక తీత పనులు నాసిరకంగా జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. చానల్‌లో కొద్ది రోజుల క్రితం నుంచి పూడిక తీత పనులు చేస్తున్నారు. యలమర్రు నుంచి రామాచంద్రపురం బ్రిడ్జి వరకు సుమారు 12 కిలోమీటర్లు తవ్వకం పనులు చేపట్టారు.

రెండు వేల ఎకరాలకు నీరందించే చానల్

గుడివాడ చానల్‌లో పూడిక తీత పనులు తూతూ మంత్రంగా జరగటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు వేల ఎకరాల సాగునీరు అందించే చానల్‌లో పూర్తి స్థాయి పూడిక తీత పనులు సక్రమంగా చేయటం లేదని యలమర్రు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు ఉపయోగం లేకుండా పనులు చేసి ఏమి ప్రయోజనం అని ప్రశ్నిస్తున్నారు. కనీనం చానల్‌లో పూర్తి స్థాయిలో కాకుండా అక్కడక్కడా పొక్లెయిన్‌తో పైపైన పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా పూడికతీత పనులు చేయటం ద్వారా చివరి భూములకు సాగునీరు ఎలా అందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వచ్చి గ్రామంలో విచారణ చేపట్టి, పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చానల్‌లో నీళ్లు ఉంటే తీత పనులు ఎలా సాధ్యం?

గుడివాడ చానల్‌లో అక్కడక్కడా నీళ్లు ఉన్నాయని, పూడిక తీత పనులు ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. పనులు నాసిరకంగా జరుగుతున్నాయని అధికారులకు తెలిపినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి పూడికతీత పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేయించాలని రైతులు కోరుతున్నారు.

> **అవసరమైన చోట మాత్రమే పూడిక తీస్తున్నాం**
>
> గుడివాడ చానల్‌లో అవసరమైన చోట మాత్రమే పూడిక తీస్తున్నాం. అన్ని చోట్లా తీస్తే నీరు కిందకు వెళ్లదు. రైతులకు ఇబ్బంది లేకుండా తవ్వకం పనులు చేయిస్తాం.
>
> – అరుణ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం



వింజరంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్(నరేగా) నిధులతో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరు, కలిదిండి మండలాల్లో వింజరం, శ్యామలాంబపురం, కొండంగి, మట్టుగుంట, పెదలంక గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. వరహాపట్నం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పూజ చేశారు. అనంతరం కలిదిండి మండలం కొండంగిలో గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కైకలూరు మండలం వేమవరప్పాడులో కోదండ రామాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ పాల్గొన్నారు.

విగ్రహాల రక్షణ కమిటీలదే బాధ్యత

పామర్రు: మండలంలోని విగ్రహాల పరిరక్షణ ఆయా కమిటీలే బాధ్యత వహించాలని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ విగ్రహాల కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్, ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి తదితర విగ్రహాల వద్ద నిరంతరం పర్యవేక్షించేలా సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా ఆయా విగ్రహాల కమిటీ సభ్యులు కూడా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తగు విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖ కూడా రక్షణ చర్యలలో పాల్గొంటుందని తెలిపారు. విగ్రహ కమిటీ సభ్యులు ఆయా విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తగు విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన టీడీపీ నాయకులు

గుడివాడరూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నందివాడ మండలం ఒద్దులమెరకకు చెందిన మెరుగుమాల వెంకటేశ్వరరావుకు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ, పట్టణంలోని సత్యనారాయణపురానికి చెందిన అల్లాడి రమణ అనే మహిళ వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.60వేల ఎల్‌ఓసీ సీఎం సహాయ నిధిని మంగళవారం అందజేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, తుమ్మలపల్లి సర్పంచ్ రాదాకృష్ణ, సింగవరపు ప్రభాకరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

భూసారానికి పచ్చిరొట్ట పైర్లు



నవధాన్యాల కిట్లను రైతులకు అందిస్తున్న గౌతమ్‌కుమార్

ముదినేపల్లి రూరల్: భూసారానికి రైతులు పచ్చిరొట్ల పైర్లు సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. పెదగొన్నూరులో సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలతో పచ్చిరొట్ల పైరు సాగు ఉపయోగాల గురించి ఆయన వివరించారు. 22 రకాలతో కూడిన 12 కేజీల నవధాన్యాల విత్తనాలు రైతులకు విక్రయించేందుకు కిట్లను సిద్ధంగా ఉంచామన్నారు. ప్రతి రైతు సాగు చేసుకోవాలని కోరారు. ఒక్కొక్క కిట్టును రూ.1,100 చొప్పున రైతులకు విక్రయించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



తోట్లవల్లూరు పరీక్ష కేంద్రం నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు



మొవ్వలో పరీక్ష రాసి తిరిగి వస్తున్న విద్యార్థులు

తోట్లవల్లూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 17న తెలుగు పరీక్షతో ప్రారంభమైన పరీక్షలు మంగళవారం జరిగిన సోషల్ పరీక్షతో పూర్తయ్యాయి. వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు తోట్లవల్లూరు కేంద్రంలో, దేవరపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు పెనమకూరు కేంద్రంలో పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగియటంతో ఆయా కేంద్రాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు.

పామర్రులో..

పామర్రు: పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 720 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 పద్మవాణి పేర్కొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలో ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగియటంతో విద్యార్థులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. కూచిపూడి, పెడసెనగల్లు, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ కేంద్రాల్లో 530 మంది ఈ పరీక్షలు రాశారు.

నందివాడ: మండలంలోని నందివాడ, రుద్రపాక, వెన్ననపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ డేవిడ్ రత్నరాజు తెలిపారు.

రేపటి నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు

కైకలూరు: కలిదిండి మండలం తాడినాడ శ్రీ సీతారామ స్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఈఓ వీఎన్‌కే.శేఖర్ పూర్తి చేయించారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అల్లూరి అచ్యుత రామరాజు, సరస్వతీ దంపతులు ఈ నెల 6న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. అదే రోజు భారీ అన్నసమారాధన జరగనుంది. కల్యాణోత్సవాలు జరుగు ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడినాడ వికాస తరంగిణీ ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరగనుంది. వినోద కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన, హరికథ కాలక్షేపాలను ఏర్పాటు చేశారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

ముదినేపల్లి రూరల్: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దంపతులు దాడి చేసిన ఘటన దేవపూడిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన వి.వెంకటేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన ఆలపాటి మణిజయకరరావు, అతని భార్య గొడవ పెట్టుకుని కర్రలతో దాడిచేశారు. గతంలో పంచాయతీ చెరువుల వేలం పాటలో వెంకటేశ్వరరావు, జయకరరావు మధ్య విభేదాలు రాగా దీనిని దృష్టిలో పెట్టుకుని దాడి చేసినట్లు బాధితుడు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై బంధువుల దాడి

ముదినేపల్లి రూరల్: భార్యాభర్తల ఘర్షణ నేపథ్యంలో ఓ వ్యక్తిపై మామ, భార్య, బావమరుదులు కలిసి దాడి చేసిన ఘటన వడాలిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు బుర్రా శివకృష్ణ, భార్య గౌతమి ఆర్థిక సమస్యల కారణంగా తరచూ గొడవలు పడుతున్నారు. దీనిపై ఆగ్రహించిన మామ, బావమరుదులు, భార్య కలిసి తనపై దాడి చేసినట్లు శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రేపు కార్పొరేషన్ లోన్ల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

గుడివాడరూరల్: మండలంలోని వివిధ కార్పొరేషన్ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విష్ణుప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్ధిదారులు దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌పుస్తకం మొదటి పేజీ జెరాక్స్ కాపీతో హాజరు కావాలని కోరారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తారని ఎంపీడీఓ టి.విజయసారథి మంగళవారం తెలిపారు.

భక్తులతో పోటెత్తిన వీరాంజనేయస్వామి ఆలయం



భక్తులతో కిటకిటలాడిన వీరాంజనేయస్వామి ఆలయం

పామర్రు: ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామికి విశేషంగా ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శత సహస్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. నాగవల్లీలు, వడ మాలతో, స్వామిని అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండి స్వామికి నివేదనలను సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. నూతన వాహనదారులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సహాయకులుగా ఫణి, శర్మ వ్యవహరించారు. ఆలయ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



హనుమంతపురంలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాంబాబు, వైస్ ఎంపీపీ మహేష్



చినపులిపాకలో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్



పామర్రులో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురంలో మంగళవారం ఉపాధి పనులను సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ప్రారంభించారు. గ్రామంలోని కూలీలందరికీ పనులు కల్పించాలని రాంబాబు కోరారు. పంటకాలువల పూడికతీత పనులు ప్రారంభించామని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు

పామర్రు: ఉపాధి హామీ పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలని వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులో ఉపాధి హామీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఫీల్డు అసిస్టెంట్లు రమేష్, పవిత్ర పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చినపులిపాక సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ సూచించారు. మండలంలోని చినపులిపాకలో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. స్థానిక వెస్ట్‌సైడ్ చానల్లో పనులకు శ్రీకారం చుట్టారు. ఉప సర్పంచ్ పాగోలు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని చినగొన్నూరులో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ కోటప్రోలు నాగు పనులు ప్రారంభించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణకు కమిటీ సమావేశం వెంటనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తబైపాస్ రోడ్ నుంచి ప్రస్తుతం వస్తున్న కైకలూరు, మండవల్లి, బంటుమిల్లి, భీమవరం బస్సులు పట్టణంలోని ఏలూరు రోడ్ నుంచి పంపేవారని ప్రస్తుతం వాటిని పాతబైపాస్ రోడ్‌కి తరలించడంతో ఆ రోడ్‌లో ట్రాఫిక్ భారీగా పెరిగి అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత విధానంలోనే కొత్త బైపాస్ రోడ్‌లోకి ట్రాఫిక్ మళ్లించాలని ఆయన కోరారు.

హనుమంతపురం అభివృద్ధికి సహకారం



హనుమంతపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పమిడిముక్కల: హనుమంతపురం అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామీ ఇచ్చారు. మండలంలోని హనుమంతపురంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షలతో నిర్మించిన ఏడు సీసీ రోడ్లను సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు లింగమనేని బాబూరావు, రాజులపాటి రామాంజనేయులు, ఎం.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ శ్యామశాస్త్రి జయంతి



గానాలాపన చేస్తున్న సరస్వతి, కృష్ణవేణి

గుడివాడ టౌన్: శ్రీ శ్యామశాస్త్రి జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో శ్రీ శ్యామ కృష్ణ గానసభ, శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు విష్ణుబొట్ల సోదరీమణులుగా ప్రసిద్ధి చెందిన సరస్వతి, కృష్ణవేణి గాత్రయుగళం కచేరి ఆద్యంతం వీనుల విందుచేసింది. మధ్యమావతి రాగాలాపన స్వరసంకల్పన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వయొలిన్ విద్వాంసుడు పామర్తి నాగేశ్వరరావు, మృదంగం బీవీఎస్ ప్రసాద్, హరిబాబుల బృందం వాద్య సహకారం అందించారు. అనంతరం సరస్వతి కృష్ణవేణిలను ఘనంగా సత్కరించారు.

సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



సీసీరోడ్డు నిర్మాణానికి పూజలు చేస్తున్న సర్పంచ్

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు స్తంభం చెరువులో సీసీరోడ్ల నిర్మాణ పనులు మంగళవారం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీ మాజీ చైర్మన్ లింగమనేని ప్రసాద్, వార్డు సభ్యుడు రెడ్డి జగన్మోహనరావు, వీరంకి వెంకయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పశువులకు నీటి తొట్టెల ఏర్పాటు

గుడ్లవల్లేరు: వేసవిలో పశువుల నీటి తొట్టెల ఏర్పాటుకు కొతవరంలో మంగళవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.విజయసారథి మాట్లాడుతూ ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ స్కీం ద్వారా మండలంలో కొతవరం, వడ్లమన్నాడు, వెనుతురుమిల్లి, కట్టవాని చెరువు, పోలిమెట్ల, చంద్రాల, డోకిపర్రు గ్రామాల్లో పశువుల నీళ్ల తొట్టెలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క నీటి తొట్టి ఏర్పాటుకు రూ.33 వేలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.